# నదీ జలాల వివాదాల సెగలతో చలికాగుతున్న పాలకులు

**కృష్ణాజలాల** వివాద పరిష్కారానికి బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు 2000 సంవత్సరంతో ముగిసింది. తర్వాత 2005లో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను నియమించారు. ఇది 2014 నాటికి తీర్పునిచ్చింది. పంపకాల్లో అన్యాయం జరిగిందంటూ రాష్ట్రాలు సుప్రీంకోర్టు గడపనెక్కడంతో ట్రిబ్యునల్ తీర్పు అమలుకాకుండా ఉండిపోయింది. ఈలోగా ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి రెండు రాష్ట్రాలేర్పడ్డాయి. దీనితో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల మధ్య ట్రిబ్యునల్ తీర్పు వల్ల అన్యాయం జరిగిందన్న వాదనలు సాగుతున్నాయి. సమస్యను పరిష్కరించుకునే దిశగా చర్యలు చేపట్టే బదులుగా, ప్రాంతీయ వైషమ్యాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని పాలకవర్గ పార్టీలు చూస్తున్నాయని మరోసారి బట్టబయలైంది.

బచావత్ ట్రిబ్యునల్ గడువు ముగుస్తుండటంతో కృష్ణానదిపై మూడు రాష్ట్రాలూ అనేక ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టాయి. దీనితో బ్రిజేష్ ట్రిబ్యునల్ ఈ ప్రాజెక్టులకు నీటిని కేటాయించింది. ఒక రాష్ట్రానికి కొంత తగ్గటమో, పెరగటమో జరిగినా సర్దుబాటు చేసుకోవచ్చు. కాగా మూడు రాష్ట్రాలూ యాగీ చేసి సుప్రీంకోర్టుకు వివాదాన్ని చేర్చాయి. దీనితో గత ట్రిబ్యునల్ గడువు ముగిసి 16 ఏళ్ళయినా, రెండవ ట్రిబ్యునల్ తీర్పువచ్చినా, అమలుజరగని స్థితిని కల్పించారు.

సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నప్పటికీ, ట్రిబ్యునల్ చేసిన ప్రాజెక్టులవారీ కేటాయింపుల్లో పెద్ద తేడాలేవీ ఉండబోవని చెప్పడానికి న్యాయకోవిదుల అవసరమేమీ లేదు; సామాన్యులకు కూడా అర్థమయ్యే విషయమే. ఇక సుప్రీంకోర్టు చెయ్యగలిగింది, ఈ కేటాయింపులు సక్రమంగా అమలు జరిగేందుకు తగిన చట్రాన్ని రూపొందించటమే. కావేరీజలాల వివాద సందర్భంగా కావేరీ జలాల ప్రాధికార సంస్థను ఏర్పాటు చెయ్యమన్న 2007నాటి సుప్రీంకోర్టు ఆదేశం ఇలా జరిగిందే. ఈనాటికీ దాని నేర్పాటు చెయ్యకుండా పాలకపార్టీలు సమస్యను సాగలాగటంతో గత నెలలో కావేరీ రక్తసిక్తమైంది.

కృష్ణానది విషయంలో సుప్రీంకోర్టుకు ఇది కూడా మిగలలేదు. మూడు రాష్ట్రాల మంత్రులు, కేంద్రమంత్రితో రాజకీయస్థాయిలో కమిటీనీ, మూడు రాష్ట్రాల, కేంద్ర సాంకేతిక నిపుణులతో నిర్వహణా కమిటీతోనూ కృష్ణా, గోదావరి నదులకు బోర్డులు ఏర్పాటుచేయాలని ట్రిబ్యునల్ తీర్పునిచ్చింది. దీనినమలు జరిపితే వివాదాలు లేకుండా నీటి వినియోగం, పంపకం సాగే అవకాశం వుంది.

కానీ సమస్య సామరస్యంగా పరిష్కారం కావటాన్ని పాలకవర్గపార్టీలు కోరుకోవటంలేదు. సమస్యను జటిలం చెయ్యటానికే పూనుకున్నారు. ట్రిబ్యునల్ తీర్పులోని కీలకాంశాన్ని (బోర్డుల ఏర్పాటు) తుంగలో తొక్కేందుకు పూనుకున్నారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు ఏర్పడటంతో, ట్రిబ్యునల్ సూచించిన నదీ బోర్డులను నాలుగు రాష్ట్రాలతో (మహరాష్ట్ర, కర్ణాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్) ఏర్పాటు చెయ్యాలన్నది సామాన్యులకైనా అర్థమౌతుంది. కానీ కేంద్రంలోని నాటి యుపిఏ ప్రభుత్వం విభజన చట్టంలో రెండు రాష్ట్రాలకే నదీ బోర్డులు ఏర్పాటుచేస్తూనూ, ఇప్పటికే ప్రాజెక్టులవారీగా పంపకం జరిగినా మళ్ళీ ఆంధ్రా, తెలంగాణాల మధ్య పంపకం చెయ్యమంటూ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కే అప్పగించటంతో నాలుగు రాష్ట్రాల ఉమ్మడి నదీ బోర్డు ఏర్పాటును తొక్కివేసింది.

విభజన చట్టం తప్పుల తడకంటూ పార్లమెంటు సాక్షిగా వీరంగం వేసిన బిజెపి, అధికారంలోకి రాగానే, లోపాలను సరిదిద్దే బదులుగా, రెండు రాష్ట్రాలకి నదీబోర్డులను నియమించింది. ట్రిబ్యునల్ ముందు ఈ రెండు రాష్ట్రాల వివాదాన్ని పరిష్కరించమని చెప్పింది.

తమ మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఆనాటి యుపిఏ ప్రభుత్వం నదీజలాల వివాదాల పరిష్కారానికి శాశ్వత ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తానంటూ ప్రచారం చేసింది. కాగా నేడు బిజెపి ప్రభుత్వం నదీ జలాల వివాదాల పరిష్కారానికి అన్ని అంశాలు కలిగిన ఒక సమగ్ర చట్టం రూపకల్పన ప్రారంభించానంటూ ప్రచారం చేస్తున్నది. ఏది ఏమైనా కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలోని నాలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు కొనసాగేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిందన్నది స్పష్టం.

నాలుగు రాష్ట్రాలకూ కలిపి నదీబోర్డులు నియమించాలన్న తీర్పు ప్రక్కనపెట్టారు. పొడిగించిన ట్రిబ్యునల్ నాలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకం చెయ్యాలని, దిగువ రాష్ట్రాలైన తెలంగాణా, ఆంధ్రాలూ; ఆ రెంటి మధ్య చెయ్యాలనీ, తమను చేర్చవద్దని ఎగువ రాష్ట్రాలైన కర్ణాటక, మహరాష్ట్రలూ వాదనలు సాగించాయి. ఆవిధంగా క్రింది రాష్ట్రాలకు అన్యాయం జరిగిందన్న, పై రాష్ట్రాలకు అధిక లబ్ధి చేకూరిందన్న భావనలు నాలుగు రాష్ట్రాల్లోనూ వ్యాప్తిచేసి ప్రాంతీయ వైమనస్యాలను పాలకవర్గ పార్టీలు పెంచుతున్నాయి. ఇరు తెలుగు రాష్ట్రాలలో ఈ పరిస్థితి మరింత తీవ్రస్థాయికి చేరింది.

సాగుభూములకు నీరు కావాలన్నది రైతాంగపు ప్రజాస్వామిక ఆకాంక్ష. దానిని తీర్చటం దోపిడీ పాలకవర్గాల లక్ష్యం కాదు. నీటి పారుదల కల్పిస్తామంటూ ఆశలు కొలిపే ప్రకటనలు చేసి పబ్బం గడుపుకుంటూ వచ్చాయి. టిడిపి ప్రభుత్వ అధినేత చంద్రబాబునాయుడు కూడా ఇవే ప్రకటనలతో కాలం గలుపుతున్నాడు. పోలవరం డ్యాము డిజైనులను పరీక్షించటానికి ఇంకా సంవత్సరకాలం పట్టనుండగా, రెండేళ్ళలో ప్రాజెక్టు పూర్తిచేస్తానంటూ పదే పదే ప్రకటిస్తున్నాడు. కేంద్ర జలవనరుల సంఘం నుండి

అనుమతులు లేకుండానే ఇప్పటికే 6 వేల కోట్లకుపైగా ఖర్చుచేసి ఇంకా 40 వేల కోట్లు అవసరమంటూ కేంద్రానికి విజ్ఞప్తులు చేస్తున్నాడు.

తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా ఇలాగే వ్యవహరిస్తున్నాడు. ప్రాణహిత – చేవెళ్ళ, మిషన్ కాకతీయ అంటూ నీటి ప్రాజెక్టుల ప్రకటనలు సాగుతున్నాయి తప్ప, వందల కోట్లు ఖర్చవుతున్నట్లు ప్రకటనలు తప్ప ప్రజల సాగునీటి ఆకాంక్షలు తీరుతాయన్న ఆశలు కనుచూపుమేరలో కూడా లేవు.

పొరుగు రాష్ట్రం వైఖరివల్లే, మోకాలడ్డటంవల్లే నీటి ప్రాజెక్టులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయంటూ పరస్పర ఆరోపణలను ఇరు తెలుగురాష్ట్రాల అధినేతలు సాగిస్తున్నారు. ప్రాంతీయ వైమనస్యాలను మరల రగిల్చి తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు పూనుకున్నారు.

గతేడాది శ్రీశైలంలోని నీటిని ఎలా వినియోగించాలో నదీబోర్డు నిర్ణయించింది. అయినా దానిని పట్టించుకోకుండా ఇరు రాష్ట్రాలూ కరెంటు ఉత్పత్తికి నీటిని దుర్వినియోగపరిచాయి; సాగర్ ఆయకట్టుకు సాగునీరు లేకుండా ఎండగట్టాయి. మా రాష్ట్రంలో బోరుబావులెక్కువ గనుక ఈ కరెంటును వాటికి సరఫరా చేస్తామంటూ తెలంగాణా వాదించింది. కష్ణానదీ బోర్డు ఛైర్మన్ స్వయంగా ఈ విషయాన్ని తెలిపాడు. రైతాంగానికి సాగునీటి సరఫరా పట్ల వీరికున్న శ్రద్ధ ఎంతో ఇది తెలుపుతున్నది.

ఉమ్మడి రాష్ట్రంలోనూ, ఇప్పుడు రెండు రాష్ట్రాలలోనూ విశాల ప్రాంతాలను కరువుపీడిత ప్రాంతాలుగానే వుంచారు, వుంచుతున్నారు. నగరాలలోని బడా బూర్జువాలకూ, విదేశీ పెట్టుబడికీ కారుచౌకగా శ్రామికులను సరఫరాచేసే ప్రాంతాలుగా వీటిని వుంచుతున్నారు. ఈ ప్రాంతాల నుండి ఏడాది పొడవునా మహానగరాలకు వలసలు సాగటం ప్రకృతి వైపరీత్యం వల్ల కాదు; సాగు లాభసాటి కానందువల్లకాదు. చౌక శ్రమశక్తి సరఫరా కొరకు సాగునీటి సరఫరాను నిర్లక్ష్యం చేసిన దోపిడీ పాలకవర్గాల ఉద్దేశపూరిత విధాన ఫలితమిది. గత 70 ఏళ్ళుగా సాగుతోన్న నాటకమిది.

ఇటీవల దీనికి అదనంగా మరో అంశం తోడైంది. నూతన ఆర్థిక విధానాలలో భాగంగా నీటిని వ్యాపార సరుకుగా పరిగణించమని ప్రపంచ వాణిజ్యసంస్థ, ప్రపంచబ్యాంకుల ఆదేశాలు. వీటి అర్థం స్పష్టమే. కొనుగోలు చెయ్యగలిగినవారికే నీటి సరఫరా చెయ్యాలి. దీని కోసమే కాలువల ఆధునీకరణపేరిట, నీటి మీటర్ల బిగింపు, ప్రతి నీటిబొట్టు సక్రమ వినియోగంపేరిట సూక్ష్మ, బిందుసేద్యం. వీటితోపాటు నీటి వినియోగ సంఘాలు ముందుకొచ్చాయి.

ఇలా భూముల నుండి రైతాంగాన్ని తొలగించటం, పంటల సాగును బహుళజాతి కంపెనీలు నిర్దేశించటం, ఆహారతయారీనే ఒక లాభదాయక వాణిజ్య, పారిశ్రామిక సరుకుగా మార్చటమన్న లక్ష్యంతో సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు రుణాలిచ్చి వీటిని అమలు జరిపించాయి. భారత పాలకులు వీటినే అమలుజరుపుతున్నారు. ఫలితంగా నీటి వనరులు దోపిడీవర్గాల లాభార్జనకు వాణిజ్య సరుకుగా మారతాయి.

ఈ అసలు లక్ష్యాలను కప్పిపుచ్చేందుకే పాలకులు ఆశల పందిళ్ళు వేస్తున్నారు; మరోవైపు ప్రజల మధ్య వైమనస్యాలను రెచ్చగొడుతున్నారు. నీటిని వృధాచేస్తున్న పాత పద్ధతులు వాడుతున్నారంటూ రైతాంగంపై నింద మోపుతున్నారు.

నదీజలాలతోపాటు నీటివనరుల సమగ్ర వినియోగం కోసం ప్రజలు డిమాండు చెయ్యాలి. విడదీసే, ఆశలు కల్పించే పాలకుల మోసానికి లోనుకాకుండా, నీటిపారుదలా సౌకర్యం ఏర్పాటు కొరకు, వారు సమైక్య ఆందోళన సాగించాలి.

ooooo